క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం



విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

ఆదోని సెంట్రల్: స్థానిక డిగ్రీ కళాశాలలో చేరేందుకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా గురువారం తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో వివరాలను పొందుపరిచి రిజిస్టరు చేసుకోవాలని చెప్పారు.ఇందుకు వెబ్‌సైట్ (ఎపిఎస్‌సిహెచ్ఇ.ఎపి.జివర్నమెంట్.ఇన్)లో రిజిష్టర్ చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ 9966487917,9985385255 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ బాలికల కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని అక్కడ సంప్రదించి అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. అధ్యాపకులు న్యూటన్‌రాజ్, తిరుపతయ్య పాల్గొన్నారు.

ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

ఆదోని సెంట్రల్: పట్టణంలో అగ్నిమాపక శాఖ అనుమతులు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు భరత్ కుమార్, శ్రీనివాసులు కోరారు. గురువారం ఈ మేరకు అగ్నిమాపక శాఖ అధికారి మహబూబ్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. నాయకులు నాగరాజు, గణేష్, ఉత్తేజ్, గౌస్, సాయి, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఆదోని రూరల్ : జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో జూలై నెలలో నిర్వహించే పాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.రామాంజనేయులు, పి.ఎస్,రాధాకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ 2019లో మంజూరైన ఆర్‌డీఎస్, వేదావతి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టకపోవడం దారుణమన్నారు. తుంగభద్ర నది ద్వారా సుమారు 50 టీఎంసీలకు పైగా నీరు యేటా సముద్రం పాలవుతుందని, ఈ నీటిని నిల్వ చేసుకొని రైతులకు సాగు నీరు అందించాలని కోరారు. ఆదోని మండల కార్యదర్శి కె.లింగన్న, పెద్దకడబూరు మండల కార్యదర్శి తిక్కన్న, కోసిగి, కౌతాళం మండల కన్వీనర్లు కె.రాముడు, ఈరన్న, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆవులను అమ్ముకున్నారని ఫిర్యాదు

ఆదోని అర్బన్ : మండలంలోని కుప్పగల్ గ్రామానికి చెందిన తిమ్మప్పస్వామి దేవస్థానానికి భక్తులు విరాళంగా ఇచ్చిన 40 ఆవులను దేవస్థాన నిర్వాహకులు కబేళాకు అమ్ముకున్నారని విరాట్ హిందుస్థాన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, గ్రామస్తులు సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ ఐదు రోజులైనా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా కాలక్షేపం చేస్తున్నారని, సబ్‌కలెక్టర్ విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ శ్రీనివాసులు

మంత్రాలయం: మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో కొద్ది రోజుల క్రితం రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదం కారణంగా గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. గురువారం మంత్రాలయం సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కిరణ్ పికెట్‌ను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవ్వరైనా గొడవలు సృష్టించాలని ప్రయత్నిస్తే వెంటనే వారిని స్టేషన్‌కు తరలించాలని చెప్పారు.

కేజీబీవీలో సీట్లు పెంచాలి

మంత్రాలయం: విద్యార్థుల చేరికలను దృష్టిలో ఉంచుకొని మండలంలోని చిలకలడోణ వద్ద నున్న కస్తూర్బా పాఠశాలలో మరో 20 సీట్లు పెంచాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములుగౌడ్, సహాయ కార్యదర్శి షాబిర్‌బాషా, థామస్ కోరారు. గురువారం ఈ మేరకు మంత్రాలయం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలు నిర్వహించామన్నారు. నాయకులు రహిమాన్ బాషా, రవితేజ, వీరేష్,బలరాం ,ఉరుకుందు, మోహన్,గణేష్ ఉన్నారు.

కౌతాళం: కస్తూర్బా పాఠశాలలకు అదనపు సీట్లు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సంఘం నాయకులు ఆర్ఐకు వినతి పత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ తాలూకా ఉపాధ్యక్షుడు ఉపేంద్ర, బసవ పాల్గొన్నారు.

ఆదోని రూరల్: జిల్లాలోనున్న కస్తూర్బా పాఠశాలల్లో సీట్లు పెంచాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు యు.దస్తగిరి ఆధ్వర్యంలో నాయకులు శివరాజ్,గోవర్ధన్,రవి,వీరేష్,కృష్ణ తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు.

పశువైద్యం.. ఉపాధి మార్గం

- వెటర్నరీ పాలిటెక్నిక్ కోర్సు దరఖాస్తుకు నేడు అఖరు



మందుల వివరాలను తెలుసుకుంటున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: విద్యార్థులు ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవడానికి వెటర్నరీ పాలిటెక్నిక్ కోర్సు ఎంతగానో ఉపాయోగపడుతుంది. ఆనిమల్ హజ్బెండరీ పాలిటెక్నిక్‌లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు ఆదోని పశువైద్య కేంద్రంలో ప్రాక్టికల్స్‌లో శిక్షణ పొందుతున్నారు.ప్యాపిలి మండలం హుసేనాపురం వెటర్నరీ కళాశాల నుంచి 11మంది విద్యార్థులు, అన్నమయ్య జిల్లా రాయచోటి, బనవాసి వెటర్నరీ కళాశాల నుంచి ఆరుగురు శిక్షణ పొందుతున్నారు. వీరికి ఎక్సిపీరియన్స్ ప్రోగ్రామ్ కింద పశు వ్యాధులు, మందులు, చికిత్స గురించి వివరిస్తారు.క్షేత్రస్థాయిలో చికిత్స ఎలా చేయాలో అవగాహనకల్పించి వారిని భాగస్వామ్యం చేస్తారు.

దరఖాస్తుకు నేడు చివరి రోజు..

పదవ తరగతిలో ఉత్తీర్ణులైన వారు వెటర్నరీ పాలిటెక్నిక్ కోర్సులో చేరవచ్చు. దరఖాస్తు చేసుకోవడానికి శుక్రవారం చివరి రోజు. పరీక్షలు నిర్వహించి మెరిట్, రోస్టర్ అధారంగా సీట్లను భర్తీ చేస్తారు. దరఖాస్తు చేసుకున్న వారికి కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుంది. కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత తరగతులు ప్రారంభమవుతాయి. ప్రతి వెటర్నరీ కళాశాలలో ఆనిమల్ హజ్బెండరీ పాలిటెక్నిక్ కోర్సులో 32 సీట్లు ఉంటాయి.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇలా..

కోర్సు పూర్తి చేసిన వారు పశు సంవర్ధక శాఖ, ఆర్బీకే కేంద్రాల్లో వెటర్నరీ అసిస్టెంట్లుగా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు. డెయిరీ, పౌల్ట్రీ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. పశువైద్యుల కొరత ఉన్న ప్రాంతాల్లో పశువైద్య సేవలతో స్వయం ఉపాధి పొందవచ్చు. ఇంటర్ అపై తరగతులు చదివే స్థోమత లేని వారు ఈ కోర్సులో చేరితే ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకొని స్థిరపడటానికి అవకాశం ఉంటుంది.

సెమిస్టర్ విధానం..

సంవత్సరానికి నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. అనాటమీ, ఫిజియాలజీ, పౌల్ట్రీ, మీట్, లైవ్‌స్టాక్ మేనేజ్‌మెంట్,జూ ఆనిమల్స్, డెయిరీ ఆనిమల్స్ మెనేజ్‌మెంట్ వంటి 18కోర్సులు సెమిస్టరుకు అరు చొప్పున ఉంటాయి. మూడు సెమిస్టర్లు కళాశాలలో, నాలుగో సెమిస్టరుకు వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రాం ఉంటుంది. కళాశాల దగ్గరలోని వెటర్నరీ ప్రయోగశాలలు, అసుపత్రుల్లో క్షేత స్థాయి ప్రాక్టికల్స్ చేయిస్తారు.

ఉపాధి అవకాశాలుంటాయని చేరా..



కోర్సు పూర్తయిన వెంటనే ఉపాధి అవకాశాలు ఉంటాయని హుసేనాపురం వెటర్నరీ కళాశాలలో పాలిటెక్నికల్ కోర్సులో చేరాను. ప్రాక్టికల్ నిమిత్తం ఆదోని పశువైద్యకేంద్రానికి పంపారు. ఈ కోర్సు చేసిన వారికి ఆర్బీకేల్లో ఉద్యోగ అవకాశాలను పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించడం శుభపరిణామం.

– సింహాద్రి విద్యార్థి, అర్ఎస్ పెండేకలు

ఉపాధికి అవకాశాలు పుష్కలం



అనంతపురం జిల్లా నార్పల మండలం నుంచి ప్రాక్టికల్ కోర్సులో శిక్షణ కోసం వచ్చాం. ఈ కోర్సు పూర్తయిన తరువాత ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. ఉద్యోగం రాక పోయినా గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్యం చేస్తూ జీవనం సాగించవచ్చు. డెయిరీ, పౌల్ట్రీ పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందవచ్చు.

– అంకిత, విద్యార్థిని, నార్పల

ఉపయోగకరంగా ఉంటుంది



వెటర్నరీ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. ముఖ్యంగా వీరికి ఏ వ్యాధులకు ఎలాంటి మందులు వాడాలి, ఎలాంటి ఇంజెక్షన్లను వేయాలి తదితర వాటిపై అవగాహన కల్పిస్తాం. క్షేత్రస్థాయికి వెళ్లి పశువులకు వైద్యం చేసేలా మెళకువలు నేర్పిస్తాం.

– డాక్టర్ విజయ్‌కుమార్, పశువైద్యుడు, ఆదోని

దరఖాస్తుకు నేడు అఖరు

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వెటర్న రీ పాలిటెక్నిక్ కళాశా లలు ఉన్నా యి. ఎక్కడి నుంచైనా దరాఖాస్తు చేసు కోవ చ్చు. మెరిట్, రోస్టర్ ప్రకారం సీట్లను భర్తీ చేస్తారు. అ న్ని కళాశాలల్లో వసతి గృహాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.పేద విద్యార్థులకు మంచి అవకాశం.

–డాక్టర్ సతీష్, ప్రిన్సిపాల్, వెంకటేశ్వర వెటర్నరీ పాలిటెక్నిక్ విశ్వవిద్యాలయం

బీమా తక్షణ సాయం అందజేత

మంత్రాలయం: మండలంలోని మాలపల్లి గ్రామానికి చెందిన హరిజన దుర్గప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి వైఎస్సార్ బీమా వర్తించడంతో అంత్యక్రియల నిమిత్తం బీమా తక్షణ సహాయం కింద రూ.10వేల నగదును సర్పంచ్ సీతారామిరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. మిగతా నగదును త్వరలో నామినీ ఖాతాలో జమ చేస్తామని తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

మంత్రాలయం: మండలంలోని చిలకలడోణ, మాలపల్లి, మంచాల గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను వ్యవసాయశాఖ ఏఓ జీరాగణేష్ గురువారం తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించి స్టాక్ వివరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. చిలకలడోణ, మాలపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.3.21 లక్షలు విలువ చేసే విత్తనాలను విక్రయించరాదని (స్టాప్ సేల్‌కు) ఆదేశించారు. అనుమతులు లేని, నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెద్దకడబూరు: విత్తనాలు, ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ హెచ్చరించారు. చిన్నతుంబళం, పెద్దకడబూరు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను గురువారం తనిఖీ చేసి స్టాక్ పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు.

విద్యాకానుక పంపిణీ

పెద్దకడబూరు : మండలంలోని ముచ్చగిరి గ్రామంలో 150మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లును సర్పంచ్ హనుమంతు, పీఎంసీ చైర్మన్ ఈరన్న గురువారం పంపిణీ చేశారు.హెచ్ఎం, ఉపాధ్యాయులు, ఉప సర్పంచ్ ఎల్లప్ప పాల్గొన్నారు.

ఆరోపణలు అర్థ రహితం



మాట్లాడుతున్న వెల్లాల మధుసూదనశర్మ, ఎస్.గోపాల్‌రెడ్డి

ఆదోని అర్బన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిపై టీడీపీ నాయకురాలు గుడిసె క్రిష్ణ చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వెల్లాల మధుసూదనశర్మ, సీనియర్ నాయకుడు ఎస్.గోపాల్‌రెడ్డి కొట్టిపారేశారు. గురువారం పార్టీ స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎయిడెడ్ స్కూళ్ల మూతబడిన విషయంలో నిజానిజాలు తెలుసుకోకుండా ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. ఎయిడెడ్ పాఠశాలలు ఉన్న భూములను వదులుకోవడానికి ఇష్టంలేని యాజమాన్యాలు ఉపాధ్యాయులను ప్రభుత్వానికి సరెండర్ చేసి పాఠశాలలను పడగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నాయన్నారు. తమ పాఠశాల భవనాలు పురాతనమైనవి, కూలిపోయే ప్రమాద ఉంది కాబట్టి మేము విద్యార్థులను చేర్చుకోము అంటూ ప్రభుత్వానికి, పిల్లలు తల్లిదండ్రులకు తెలిపి ముందుగానే పిల్లలను స్కూళ్లలో చేర్చుకోకపోవడాన్ని తెలుసుకొని మాట్లాడాలన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మూతబడిన సంతపేట స్కూల్‌ను అమరావతినగర్‌లో ప్రారంభించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అమరావతినగర్ కాలనీలోని 5వ తరగతి వరకు ఉన్న పాఠశాలను మూడేళ్లల్లోనే పదో తరగతి వరకు పెంచింది నిజంకాదా అని నిలదీశారు. అలాగే.. చదులరామయ్య స్కూల్‌ను కోట్ల విజయభాస్కరరెడ్డి కాలనీలో ప్రారంభించింది కళ్లకు కనిపించడం లేదా అని మండిపడ్డారు. ఇకనైనా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.





శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వను దర్శించుకున్న జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, మసీదులో ప్రార్థనలు చేస్తున్న ఎస్పీ

లక్ష్మమ్మవ్వ సేవలో ఎస్పీ

ఆదోని అర్బన్ : ఆదోని ఇలవేల్పు శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వను జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు రాచోటి సుబ్బయ్య వారికి పూర్ణకుంభాలతో స్వాగతం పలికారు. అనంతరం అవ్వకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. డీఎస్పీ శివనారాయణస్వామి ఉన్నారు. అలాగే.. ఈనెల 29న జరగనున్న బక్రీద్ పండగ సందర్భంగా పట్టణంలోని షాహి జామియా మసీదును జిల్లా ఎస్పీ, సబ్ కలెక్టర్ సందర్శించారు. మసీదు పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఖతీఫ్‌జునాయిద్‌ఆస్మి వారితో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మతపెద్దలతో చర్చించారు.

గ్రామాల్లో ప్రశాంతంగా జీవించండి



మాట్లాడుతున్న డీఎస్పీ సీతరామయ్య

కౌతాళం: గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతరామయ్య సూచించారు. గురువారం రాత్రి ఫ్యాక్షన్ గ్రామమైన హాల్విలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ఆవరణంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గొడవలకు వెళ్లకుండా పిల్లలను బాగా చదివించుకోవాలని చెప్పారు. కోసిగి సీఐ ఏరిషావలి, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఉన్నారు.

కుట్టు శిక్షణ ప్రారంభం

కోసిగి: ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సూగూరు గ్రామంలోని 27 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ రీజనల్ డైరెక్టర్ రామేశ్వరి తెలిపారు. గురువారం గ్రామంలో 27 కుట్టుమిషన్‌లు ఏర్పాటు చేసి శిక్షణను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు జీవనోపాధి కల్పించేందుకే ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 6 నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆ తరువాత సొంతంగా జీవనోపాధి పొందవచ్చన్నారు. ఎమ్మిగనూరు, కోసిగి ఏరియా టీమ్ లీడర్స్ సుబ్రహ్మణ్యం , కృష్ణయ్య పాల్గొన్నారు.

ఖాదర్‌లింగ స్వామికి ప్రత్యేక ఫాతెహాలు

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గా దర్శనార్థం గురువారం భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సరమర్పించారు. భక్తుల రాకతో దర్గా పరిసరాలు కిటకిటాలాడాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి పూజలు చేశారు. సాయంత్రం దర్గాలో సలాముల ఆలపాన, ఖాదర్ లింగస్వామి ప్రవచనాలు ఆలపించారు.

అండర్-18 బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక



బాస్కెట్ బాల్ టీమ్‌తో అధ్యాపకులు, పీఈటీలు

ఆదోని సెంట్రల్: ఆదోని అర్ట్ అండ్ సైన్సు కళాశాల విద్యార్థులు అండర్-18 బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. గుంటూరులో జరిగే అంతరజిల్లాల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు 12మంది ఇక్కడ నుంచి బయలు దేరుతున్నట్లు చెప్పారు. కోచ్‌లుషేక్ హుసేన్‌బాషా, విశ్వనాథ్‌ను అభినందించారు.

జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

మంత్రాలయం: మండల కేంద్రంలోని శ్రీ వైష్ణవి పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న లక్ష్మణ్‌గౌడ్ ఈనెల 3,4,5వ తేదీల్లో ముంబైలో నిర్వహించిన రోప్ స్కిపింగ్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించాడు. ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో 3వ స్థానం దక్కించుకున్నాడు. విద్యార్థిని గురువారం ఏఓ రాఘవేంద్ర, పాఠశాల సిబ్బంది అభినందించారు.

సీతారామ్‌నగర్‌లో చోరీ

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న సీతారామ్‌నగర్ కాలనీలో చోరీ జరిగిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఇంటి యజమాని చెన్నారెడ్డి పోలీసులకు తెలిపిన మేరకు.. పని నిమిత్తం కడపకు వెళ్లి రెండు రోజుల తర్వాత గురువారం సాయంత్రం ఇంటికొచ్చి చూడగా.. తాళం పగలగొట్టి ఉండటంతో లోపలికెళ్లి చూస్తే బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారం, 250 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.25 వేల నగదు దొంగలించారని తెలిసిందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

బాలుడికి స్వల్ప గాయాలు

మంత్రాలయం రూరల్: చెట్నేహళ్లి గ్రామానికి చెందిన డానియల్ కుమారుడు కార్తిక్ (4) ద్విచక్ర వాహనం తగిలి స్వల్పంగా గాయపడ్డాడు. గురువారం మధ్యాహ్నం సమయంలో రోడ్డు దాటే క్రమంలో బైక్ తగిలింది. స్వల్పంగా గాయపడటంతో మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆసుపత్రిలో చికిత్స పొందారు.

ఆటో, బైక్ ఢీ.. వ్యక్తికి గాయాలు

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఆలూరు రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొని పోస్టల్ కాలనీకి చెందిన రాజశేఖర్‌కు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. బైకుపై వస్తున్న రాజశేఖర్ ఆలూరు వైపు వెళ్తున్న ఆటోను ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు.

అనుమతులు లేకుండా నిర్మిస్తే కూల్చేస్తాం

ఆదోని టౌన్ : మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా భవంతులు, కట్టడాలు నిర్మిస్తే కూల్చివేస్తామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన మూడో వార్డులోని దండుగేరిలో పర్యటించారు. కాలనీలో అక్రమ కట్టడాలు ఎక్కువగా ఉన్నాయని, త్వరలోనే ఆయా భవంతులకు సంబంధించిన యజమానులకు నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. అనంతరం మున్సిపల్ కౌన్సిల్‌హాలులో శానిటరీ సెక్షన్ సెక్రటరీలు, ఏఎస్ఎంలతో సమావేశం నిర్వహించారు. ప్రతి శుక్రవారం జరిగే ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంపై సెక్రటరీలకు పలు సూచనలు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలి

మంత్రాలయం రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ నాయకులు కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ పేద విద్యార్థులు పాఠ్యపుస్తకాలు కొనుగోలు చేయలేకపోతున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు కల్యాణ్, అశోక్, శివకృష్ణ, యాకోబు, గణేష్, వెంకటేష్, జయరాజు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మంత్రాలయం రూరల్: మండలంలోని ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు, పుస్తకాలు, డ్రస్సులు, షూ, టై, రవాణా చార్జీలంటూ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎంఈఓ-2 రాఘన్న గురువారం హెచ్చరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు, విద్యా కానుక, జగనన్న గోరుముద్ద తదితర కార్యక్రమాలను వందశాతం అమలుకు కృషిచేస్తామన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

కోసిగి: జగనన్న సురక్షతో ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తుందని ఎంఎల్‌ఓ హనుమంతు రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సచివాలయం-2 కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్ల, గృహసారథులు, వలంటీర్లతో కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

కోసిగి: రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం సత్యమ్మ సూచించారు. గురువారం స్థానిక స్త్రీ శక్తి సమావేశ భవనంలో మహిళ సమాఖ్య మండల అధ్యక్షురాలు సాయమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పొందిన మహిళలకు బయోమెట్రిక్ వేసి రుణాలు ఎందుకు ఉపయోగించారో అడిగి తెలుసుకోవాలని చెప్పారు. సున్నా వడ్డీ, జగనన్న తోడు రుణాలు, స్త్రీ నిధి నిధులను సద్వినియోగం చేసుకొని రుణాలు బ్యాంక్‌లకు సకాలంలో రుణాలు చెల్లించేలా చూడాలన్నారు. త్వరలో పొదుపు మహిళలకు జీవనోపాధి కింద పెరటి కోళ్లు అందిస్తున్నామని, అవసరమైన వారి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



మద్యం ప్యాకెట్లను ట్రాక్టర్‌తో తొక్కిస్తున్న దృశ్యం

కౌతాళం: కోసిగి సర్కిల్ పరిధిలో అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన కర్ణాటక మద్యంను ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రం పరిసరాల్లో ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో పట్టుబడిన ఎక్సైజ్,నాటు సారాకు చెందిన 21కేసులకు సంబంధించి 5,622 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను, 30 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు చెప్పారు. వీటి విలువ దాదాపు రూ.5,62,000 వరకు ఉంటుందన్నారు. కోసిగి సీఐ ఏరిషావలి, కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డితో పాటు కోసిగి, పెద్దకడుబూరు ఎస్ఐలు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కోసిగి: స్థానిక మోడల్ స్కూల్‌లో 7,8,9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 24వ తేదిలోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 27న పాఠశాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. 28న ఉత్తీర్ణత సాధించిన వారిలో మెరిట్ లిస్ట్ పాఠశాల నోటీస్ బోర్డులో అతికిస్తామన్నారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.